క్లుప్తంగా

నాయీబ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం

ఆళ్లగడ్డ: దేశ చరిత్రలో నాయీబ్రాహ్మణులకు అరుదైన గౌరవం కల్పించి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ తొండుమల్ల పుల్లయ్య అన్నారు. స్థానిక ఎంపీనగర్‌ శివాలయ ఆవరణలో బుధవారం నియోజకవర్గ నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వృత్తి దారులు, వాయిద్య కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న వచ్చిన తరువాతనే నాయీబ్రాహ్మణుల తలరాతలు మారిపోయాయన్నారు. 1,100 దేవాలయాల్లో బోర్డు సభ్యుడిగా నాయిబ్రాహ్మణుడు ఉండేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్పోరేషన్‌ డైరెక్టర్‌ నారాయణప్రకాశ్‌, బాలనరసింహులు, గురు, సుబ్బరాయుడు, జిల్లెల్ల పుల్లయ్య, నాగరాజు, శ్రీకాంత్‌, భాస్కర్‌, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్‌): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్‌ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి మరియానందం, రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్‌ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. సాంబశివుడు, పుల్లయ్య, మునిస్వామి, పవన్‌కుమార్‌, బేబిరాణి, రవి పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

నంద్యాల(సిటీ): ప్రతి ఒక్కరూ స్వీయ శుభ్రత పాటించి రోగాలను అదుపు చేయాలని మున్సిపల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ వెంకటదాసు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్‌ వాష్‌ స్టేషన్‌ను మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పట్టణ సమాఖ్య ప్రతినిధులు చాంద్‌బీ, నాగార్జునమ్మ, రోజా రాణి పాల్గొన్నారు.

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలి

రుద్రవరం: గ్రామ పంచాయతీ సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లోనే చేపట్టాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం పంచాయతీ,సచివాలయ ఉద్యోగులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరంగా పన్నులు వసూళ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలని సూచించారు.అలాగే స్వతహాగా వనరులను సమకూర్చుకొని అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు.

మహిళలకు గాయాలు

రుద్రవరం: హరినగరం గ్రామంలో బుధవారం మోటార్‌ సైకిల్‌పై నుంచి కింద పడి ఇద్దరు మహిళలు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ముకుందాపురం గ్రామానికి చెందిన సరోజిని,లక్ష్మీదేవి మోటార్‌ సైకిల్‌పై ఆళ్లగడ్డ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా హరినగరంలో కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లకు చెందిన ముల్లా ఇబ్రహీం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బుధవారం మృతుడి భార్య ముల్లా బానుకు వైఎస్సార్‌ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను ఉప సర్పంచు ఇంతియాజ్‌ అందజేశారు. వైఎస్సార్‌పీ నాయకుడు చంద్ర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రేపు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

శిరివెళ్ల: గుంప్రమాన్‌దిన్నెలో ఈ నెల 19వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్‌2 వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. స్పెషలిస్ట్‌ డాక్టర్లు, యర్రగుంట్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం, గాంధీనగరం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయ జయంతి

ఉయ్యాలవాడ : స్థానిక కమతం వీధిలో శ్రీ కృష్ణదేవరాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల బలిజ సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాలకులు రాయల పాలనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సీనియర్‌ న్యాయవాది మృతి

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన సీనియర్‌ మహిళా న్యాయవాది లక్ష్మీదేవి(58) అనారోగ్యంతో మృతి చెందారు. బార్‌ అసోసియేషన్‌ మహిళా సెక్రటరీగా పనిచేసిన ఈమె ప్రస్తుతం మహిళా శిశు సంక్షేమ శాఖలో స్టేట్‌ మెంబర్‌గా పని చేస్తున్నారు. ఈమె మృతి పట్ల బార్‌ అసోసియేషన్‌ నాయకులు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్‌ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, రవీంద్రనాథ్‌, కృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, ఓబులరెడ్డి, ప్రసాదరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేసి ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: చాలా కాలంగా నిలిచిపోయిన తెలుగు పండిట్ల పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మార్గం సుగమం

- ఏళ్లుగా వేధిస్తున్న రహదారి సమస్యకు పరిష్కారం
- గ్రామీణులు, విద్యార్థులు, ఉద్యోగులకు తప్పిన ఇక్కట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇది కదా.. అభివృద్ధి

రుద్రవరం: మేజర్‌ పంచాయతీ అయిన రుద్రవరానికి రెడ్డిపల్లె,తువ్వపల్లె మజరా గ్రామాలు. ఇవి మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో ఉన్నాయి. సీఎం రోడ్డు మీదున్న మెట్ట నుంచి రెడ్డిపల్లె,తువ్వపల్లె, అలాగే తిప్పమీదున్న ఏపీ మోడల్‌ పాఠశాల, విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వరకు ఒకటే రహదారి. ఆయా గ్రామాల్లోకి, ప్రభుత్వ కార్యాలయాలు, బడులు,తిప్పపై నుంచి మట్టి, కంకర, వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు వివిధ పనుల నిమిత్తం నిత్యం వందలాది వాహనాలు ఆ దారిపై తిరిగేవి. వాహనాల రాకపోకలు అధికం కావడంతో రోడ్డు దెబ్బతినింది. శిథిలమైన రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ చేరి ప్రమాదాల బారిన పడేవారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, ఉద్యోగులు గత ప్రభుత్వానికి విన్నవించారు. అయినా నాడు స్పందన కొరవడింది. ఇక పరిస్థితి ఇంతేననుకుని కాలం వెళ్లదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానికులు సమస్యను వివరించారు. అంతే ఆయన రూ.16లక్షలు మంజూరు చేయించి ప్రధాన రహదారిపై సీసీరోడ్డు, కల్వర్టు నిర్మించారు. పనులు పూర్తి కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రెడ్డిపల్లెలో వేసిన సీసీ రోడ్డు


నాడు - అధ్వానంగా కొండాపురంలో ప్రధాన రహదారి


నేడు - సీసీరోడ్డు నిర్మించిన దృశ్యం

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

దొర్నిపాడు: గ్రామంలోని ప్రధాన రహదారికి సరిగా లేదు.. గుంతలు పడి అధ్వానంగా మారింది పరిష్కరించాలని గ్రామస్తులు పలుమార్లు నాయకులు, అధికారులకు గతంలో విన్నవించారు. నాడు వారి చెవికెక్కలేదు. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భాగ్యనగరం, కొండాపురం, దొర్నిపాడు గ్రామాల్లోని ప్రధాన రహదారిలో రెండు కిలోమీటర్ల పొడవున రూ.4 కోట్లు ఖర్చు చేసి సీసీరోడ్డు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపారు. దశాబ్దాల సమస్య పరిష్కారం కావడంతో మూడు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు సమస్య తీరింది



గ్రామంలో ప్రధాన రహదారిపై తిరగాలంటే మురుగునీరు నిల్వ ఉండేది. దీంతో దుర్గంధంతో అల్లాడిపోయాం. చాలా మంది ప్రజలు గ్రామంలో వ్యాధుల బారిన పడేవారు. రోడ్డు వేయాలని నాడు కోరినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా సీసీ రోడ్డు వేయించి మురుగు సమస్యను తొలగించింది. – వెంకటేశులు,రెడ్డిపల్లె

భయం భయంగా రాక పోకలు



ఇంటికి అవసరమైన సరుకులు తెచ్చుకునేందుకు రుద్రవరానికి వెళ్లి రావాలంటే భయం భయంగా ఉండేది. వర్షాకాలం నీరు నిలిచిన మోకాలిలోతు గుంతలో ద్విచక్రవాహనం నడపాలంటే నరకం కనిపించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీసీ రోడ్డు వేసి భయాన్ని తొలగించారు.

– మద్దిలేటి,రెడ్డిపల్లె

ఇబ్బందులు తొలగాయి



మోడల్‌ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరం కలిసి దాదాపు 600 మంది ఉన్నాం. విద్యార్థులు మాత్రం పల్లెల నుంచి విద్యార్థి బస్సుల్లో వచ్చే వారు. బోధన సిబ్బంది ద్విచక్ర వాహనాలపై వెళ్లేవాళ్లం. రోడ్డు దెబ్బతిని రాకపోకల సమయంలో వాహనాలపై నుంచి కింద పడి గాయాల పాలయ్యేవారు. రోడ్డంతా గుంతలమయమైందని ఉద్యోగులు గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిధులు కేటాయించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం సమస్యను పరిష్కరించి ఇబ్బందుల నుంచి గట్టెక్కించారు.

– నాగేశ్వరరావు, ఏపీ మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌

క్రైస్తవ సంఘాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్‌): కానాల క్రైస్తవ సంఘాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని మేరీక్వీన్‌ ఆఫ్‌ ఏంజిల్‌ (ఆర్‌సీఎం) చర్చి పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంఘస్తులు ఏర్పాటు చేసిన ప్రార్థన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌ విజయశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు కాశీం, మరియదాసు, సుబ్బన్న పాల్గొన్నారు.

ప్రపంచం ఏపీ వైపు చూస్తోంది

నంద్యాల(అర్బన్‌): ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్‌ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌ వైపు ప్రపంచ దేశాలన్నీ చూస్తున్నాయని ఏపీఎస్పీడీసీఎల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శశికళారెడ్డి, వైఎస్సార్‌సీపీ జోనల్‌ ఇన్‌చార్జ్‌ బిలావత్‌ శంకర్‌నాయక్‌ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని విగ్రహాల్లో మూడవ స్థానంలో నిలుస్తున్న బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. చంద్రబాబునాయుడు అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణపై మాట తప్పారని గుర్తు చేశారు. 19న జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు విజయవాడకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

నవరత్నాలు దేశానికే ఆదర్శం


ఆర్‌.పాంపల్లెలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల, ఎంపీ పోచా

ఉయ్యాలవాడ : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు అనుసరిస్తూ ఆదర్శంగా తీసుకుంటున్నారని నంద్యాల పార్లమెంట్‌ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొండుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్‌.పాంపల్లె గ్రామంలో ఎంపీటీసీ కపురం శివమ్మ, సర్పంచ్‌ చాబోలు లక్ష్మీదేవి, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందించి లబ్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా రైతులకు అండగా ఉంటూ పంటలకు సాగు నీరందించినా ఘనత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వం రూ.18,90,37,386లు ఖర్చు చేయగా, ఇందులో 3,250 కుటుంబాలకు ప్రత్యక్షంగా రూ.12,20,47,452, పరోక్షంగా 1,330 మంది లబ్ధిదారులకు రూ.5,57,89,934 లబ్ధి చేకూర్చిందని వివరించారు. సర్పంచ్‌లు పల్లె గురప్రసాద్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డ్‌ డైరెక్టర్‌ గజ్జల క్రిష్టారెడ్డి, సింగిల్‌ విండో చైర్మన్లు పోచా వెంకటరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, నాయకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, చాబోలు మధుబాబు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుచరిత పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌ బాషా

నంద్యాల: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌ బాషా పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల19వ తేదీన విజయవాడలో 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.404 కోట్ల వ్యయంతో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్‌ విగ్రహాన్ని, అలాగే స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. విజయవాడకలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. దేశంలో అత్యంత ఎత్తైన అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని, రూ.150 కోట్లతో జీవో తెచ్చినట్లు నటించారే తప్ప పునాదులు కూడా వేయలేదని విమర్శించారు. బెస్త సంఘం డైరెక్టర్‌ చంద్రశేఖర్‌, మాజీ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ విజయశేఖర్‌రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ కార్యదర్శి కారురవికుమార్‌, సంద్యాల పట్టణ అధ్యక్షులు పున్నాశేషయ్య, జాకీర్‌ హుసేన్‌ , మాజీ కౌన్సిలర్‌ అనీల అమృతరాజ్‌, నాయకులు దేశం సుధాకర్‌ బీమనిపల్లి వెంకట సుబ్బయ్య, రామచంద్రుడు, ఎస్టీ సెల్‌ జిల్లా నాయకులు శంకరానాయక్‌, వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోన్‌ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయిరాం రెడ్డి, బసవేశ్వరరెడ్డి, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న రాజు

నంద్యాల(న్యూటౌన్‌): స్థానిక ఇండోర్‌ స్టేడియం క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి కుస్తీ పోటీలను జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రాజు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఇందులో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పురుషుల ఫ్రీస్టైల్‌ విభాగంలో 65కేజీల బరువు కేటగిరిలో యూసుఫ్‌, 70 కేజీల్లో వెంకటేశ్వర్లు, 74కేజీల్లో దుర్గాప్రసాద్‌, 79కేజీల్లో ప్రదీప్‌(కర్నూలు), 86 కేజీల్లో మధురంగడు(కర్నూలు), 97 కేజీల్లో నాగేంద్ర విజేతలుగా నిలిచారు. అలాగే పురుషుల గ్రీకోరోమన్‌ విభాగంలో 55 కేజీల బరువు కేటగిరీలో మోహన్‌దుర్గా, 72 కేజీల్లో రాజారావు, 67కేజీల్లో నరసింహులు విజయం సాధించారు. ఫ్రీస్టైల్‌ విభాగంలో స్త్రీల 53కేజీల విభాగంలో మనీషా, 65కేజీల్లో రాణి ప్రతిభ చాటారు. విజేతలు ఈనెల 20, 21 తేదీల్లో కాకినాడలోని పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ప్రధాన కార్యదర్శి వినుకొండ రాబర్ట్‌ తెలిపారు. పీఈటీల సంఘం మాజీ సెక్రటరీ రాబర్ట్‌, నంద్యాల జిల్లా రెజ్లింగ్‌ సంఘం నాయకులు భరత్‌రెడ్డి, చార్లెస్‌కుమార్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికను సక్రమంగా నిర్వహించాలి


గోస్పాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

గోస్పాడు: గ్రామ పంచాయతీల ముందస్తు అభివృద్ధి ప్రణాళికలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ ఆర్థర్‌ సైమాన్‌ తెలిపారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఎంపీడీఓ నాగఅనసూయ ఆధ్వర్యంలో శిక్షణ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల అభివృద్ధిపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేలా శిక్షణ సమావేశాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వినియోగం, గ్రామాల్లో ఏఏ రకాల వసతులు, పనులు చేపట్టాలో ముందస్తు ప్రణాళిక ద్వారా నివేదికను తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులనుజజవాటర్‌, శానిటేషన్‌తో పాటు ఇతర అభివృద్ధి పనులకు ఎంత మేరకు వినియోగించాలో ముందస్తు ప్రణాళిక దోహద పడుతుందన్నారు. ఎంఈఓ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్‌): గ్రామాల అవసరాలు, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. 2024–25 ఏడాదికి సంబంధించి గ్రామాల అభివృద్ధి ప్రణాళికలను పక్కాగా తయారు చేయాలని కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ ప్రభాకర్‌ అధ్యక్షతన గ్రామ, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అవసరాలు, నిధులకు సంబంధించిన యాక్షన్‌ ప్లాన్‌ను తయారు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ సుగుణశ్రీ మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయో గుర్తించి ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామానికి అవసరమైన వాటిపై గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు అంకన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామపంచాయితీలను అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు వనరులను సేకరించి ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. బుధవారం స్థానిక మండలపరిషత్‌ కార్యాలయంలో సమావేశ మందిరంలో శిక్షకుడు స్వర్ణకుమార్‌ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్రతో క్రీడోత్సవం


యాళ్లూరులో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రతో క్రీడాకారుల ఉత్సాహం పెంపొందుతుందని ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మండలంలోని యాళ్లూరు హైస్కూల్‌ ఆవరణలో బుధవారం క్రికెట్‌ పోటీలను నిర్వహించారు. నెహ్రూనగర్‌, కానాల పల్లె సచివాలయాల మధ్య జరిగిన మ్యాచ్‌ నిర్వహించారు. అనంతరం గోస్పాడు, యాళ్లూరు–1 సచివాలయాల మధ్య పోటీలు జరగగా నెహ్రూనగర్‌ జట్టు గెలుపొందింది. గోస్పాడు, యాళ్లూరు–1 సచివాలయ జట్ల మధ్య పోటీలో యాళ్లూరు జట్టు గెలుపొందింది. యాళ్లూరు–2, ఎం.కృష్ణాపురం జట్ల మధ్య మ్యాచ్‌ జరగగా ఎం.కృష్ణాపురం జట్టు గెలుపొందినట్లు ఫిజికల్‌ డైరెక్టర్లు సాల్మాన్‌, నాగేషు తెలిపారు.

నంద్యాల(అర్బన్‌): ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో విజేతలైన జట్లు నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది గ్రామాలకు గుర్తింపు తేవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ, కోచ్‌ పిచ్చిరెడ్డి కోరారు. స్థానిక అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న ఎస్‌వీఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో జరుగుతున్న క్రికెట్‌ మండల స్థాయి ఫైనల్‌ పోటీలను బుధవారం ప్రారంభించారు. అయ్యలూరు–1 జట్టుపై కానాల–2 జట్టు విజయం సాధించింది. వాలీబాల్‌ ఫైనల్‌ పోటీల్లో పాండురంగాపురం జట్టుపై పెద్దకొట్టాల జట్టు విజయకేతనం ఎగురవేసింది. అంతకు ముందు జరిగిన కబడ్డీ మండల స్థాయి పోటీల్లో అయ్యలూరు–1 జట్టుపై కొత్తపల్లె –1 జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

బ్యాడ్మింటన్‌ విజేత దొర్నిపాడు

దొర్నిపాడు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బ్యాడ్మింటన్‌ పోటీలు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం కొండాపురం, దొర్నిపాడు టీంలు తలపడగా దొర్నిపాడు టీం మహేంద్ర, వెంకీలు విజయం సాధించి తాలుకా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జున వారిని అభినందించారు. ఫిజికల్‌ డైరెక్టర్లు దేవేంద్ర, శ్రీధర్‌ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ యూత్‌,హమాలీ యూనియన్‌ నాయకులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 32 జట్లు పోటీ పడ్డాయి. పోటీలు బుధవారం ముగిశాయి. చిన్న కంబలూరు గ్రామానికి చెందిన భరత్‌ టీం విజేతగా నిలవగా,అలాగే అదే గ్రామానికి చెందిన రమేష్‌ టీం ద్వితీయ స్థానంలో నిలిచింది.శిరివెళ్ల మండలం కోటపాడు టీం మూడో స్థానం, దొర్నిపాడు మండలానికి చెందిన దస్తగిరి టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. ఆ జట్లకు వరుసగా రూ.20వేలు,రూ.15వేలు, రూ.10వేలు,రూ.5వేల నగదు బహుమతులు అందజేశారు. గ్రామ నాయకులు జంగా బాలీశ్వర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి,ఎడవలి ప్రసాదు,నందయ్య, శేఖర్‌ పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో ఆడుదాం ఆంధ్ర పోటీలు పోటా పోటీగా జరుగుతున్నాయి. బుధవారం గోవిందపల్లె, యర్రగుంట్ల, మహదేవపురం మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ పోటీలు జరిగాయి. గోవిందపల్లెలో బోయలకుంట్ల, యర్రగుంట్ల జట్ల మధ్య కబడ్డీ పోటీ జరగగా బోయలకుంట్ల విజయం సాధించింది. అదే మైదానంలో శిరివెళ్ల, గోవిందపల్లె మధ్య కబడ్డీ పోటీ జరగగా గోవిందపల్లె జట్టు విజయం సాధించింది. ఖోఖోలో యర్రగుంట్ల, గోవిందపల్లె జట్లు తలపడగా గోవిందపల్లె జట్టు గెలుపొందింది. మహదేవపురం మైదానంలో గంగవరం, మహదేవపురం జట్ల మధ్య కబడ్డీ పోటీ జరగగా గంగవరం విజయం సాధించింది. యర్రగుంట్ల మైదానంలో జీనేపల్లె, యర్రగుంట్ల జట్ల మధ్య వాలీబాల్‌ పోటీ జరగగా యర్రగుంట్ల జట్టు విజయం సాధించింది. యర్రగుంట్ల, శిరివెళ్ల జట్ల మధ్య వాలీ బాల్‌ పోటీ జరగగా యర్రగుంట్ల జట్టు విజయం సాధించింది. ఈ నెల 19, 20 తేదీల్లో సెమీ ఫైనల్‌, ఫైనల్‌ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


బ్యాడ్మింటన్‌ క్రీడాకారులతో ఫిజికల్‌ డైరెక్టర్లు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


గోవిందపల్లెలో కబడ్డీ పోటీలు


క్రికెట్‌లో విజేతగా నిలిచిన కానాల-2 జట్టు


వాలీబాల్‌ ఆడుతున్న క్రీడాకారులు

కూలీలకు పనులు కల్పించాలి


ఒంటివెలగలలో రైతులతో మాట్లాడుతున్న అంబుడ్స్‌పర్సన్‌

గోస్పాడు: గ్రామాల్లో కూలీలకు సకాలంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని అంబుడ్స్‌పర్సన్‌ సురేంద్రకుమార్‌ తెలిపారు. బుధవారం మండలంలోని ఒంటివెలగల గ్రామంలో ఉపాధి పథకం కింద సాగు చేసిన కొబ్బరి మొక్కలను పరిశీలించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టాలో ప్రణాళిక ప్రకారం గుర్తించాలని చెప్పారు. ప్రతి ఒక్కరికి వంద రోజుల పనిదినాలు కల్పించేలా చూడాలన్నారు. గ్రామాల్లో హార్టికల్చర్‌ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకు అనుగుణంగా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఏపీఓ నాగజ్యోతి, టెక్నికల్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.